
సాక్షి
ఒడిశా

బుధవారం । 7 । ఫిబ్రవరి । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు
నగదు రూ.5,80,931
బంగారం 2 గ్రాముల 500 మిల్లీ గ్రాములు
వెండి 109 గ్రాముల 500 మిల్లీ గ్రాములు
- భువనేశ్వర్/పూరీ



వాడివేడిగా అసెంబ్లీ సమావేశాలు
రాష్ట్ర శాసనసభలో మధ్యంతర బడ్జెటు సమావేశాలు వాడివేడిగా సాగుతున్నాయి.
- 8లో



నేటి నుంచి ఒడిశా ట్రావెల్ బజార్
రాష్ట్రంలో 5వ ఒడిశా ట్రావెల్ బజారు కార్యక్రమం బుధవారం నుంచి ప్రారంభమవుతుంది.
- 8లో


న్యూస్‌రీల్

మర్యాదపూర్వక భేటీ



భువనేశ్వర్, కటక్ జంట నగరాల పోలీసు కమిషనర్ సంజీబ్ పండా మంగళవారం స్థానిక రాజ్ భవన్ సందర్శించారు. జంట నగరాల పోలీసు కమిషనర్‌గా ఆయన ఇటీవల బాధ్యతలు చేపట్టారు. ఈ నేపథ్యంలో రాజ్‌భవన్‌లో గవర్నర్ రఘుబర దాస్‌ని మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు.
- భువనేశ్వర్

త్రుటిలో తప్పిన ప్రమాదం



యువతులను రక్షిస్తున్న డ్రైవర్లు



ఒడ్డుకు తీసుకొచ్చిన యువతులకు సపర్యలు చేస్తున్న దృశ్యం

మల్కన్‌గిరి: జిల్లాలోని ఖోయిర్‌పుట్ సమితి గోవిందపల్లి గ్రామం వద్దనున్న సప్తధర జలాశయం వద్దకు పలు కుటుంబాలు ఆహ్లాదంగా గడిపేందుకు మంగళవారం వెళ్లారు. వారిలో ఒక కుటుంబ సెల్ఫీ తీసుకునేందుకు నీటిలో దిగారు. అయితే జలాశయంలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో ఇద్దరు యువతిలు మునిగిపోయారు. వెంటనే అక్కడ ఉన్నవారు కేకలు వేయడంతో వెంటనే వాహనాల డ్రైవర్లు నీటిలో దిగి వారిని రక్షించారు. కానీ అప్పటికే వారు కాస్త అస్వస్థతకు గురవ్వడంతో మత్తిలి ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అయితే మొబైల్‌లో రీల్స్ చేయడం కోసం నీటిలో దిగడంతోనే ప్రమాదం జరిగిందని వారు తెలియజేశారు. దీంతో జాగ్రత్తలు తీసుకోకుంటే ప్రాణాలకే ప్రమాదం వస్తుందని పలువురు హెచ్చరిస్తున్నారు.

135 కిలోల గంజాయి పట్టివేత



అరెస్టైన వ్యక్తులను చూపిస్తున్న పోలీసులు

బరంపురం: దిగపండి నుంచి బరంపురం నగరానికి అక్రమంగా రవాణా చేస్తున్న గంజాయిని ఎక్సైజ్ అధికారులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. బరంపురం ఎక్సైజ్ అధికారులు తెలిపిన వివరాల మేరకు.. గంజాం జిల్లా దిగపండి నుంచి బరంపురం వైపు వస్తున్న ఒక కారులో అక్రమంగా గంజాయి రవాణా అవుతున్నట్లు ముందస్తు సమాచారం వచ్చింది. దీంతో హింజికాట్-దిగపండి-బరంపురం మధ్య మూడు రోడ్ల కాలుసందపూర్ జంక్షన్‌లో తనిఖీలు నిర్వహించారు. దీనిలో భాగంగా ఒక కారులో తనిఖీలు చేపట్టగా 5 బస్తాల్లో 135 కిలోల గంజాయి పట్టుబడింది. దీంతో కారును సీజ్‌చేసి, ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. అరెస్టైనవారు పశ్చిమ బెంగాల్ రాష్ట్రం మిధనపూర్ జిల్లాకి చెందిన హరదన బెహారా, విశ్వజిత్ దాస్‌లుగా గుర్తించారు. అరెస్టైన ఇద్దరినీ కోర్టుకి తరలించారు.

పోలింగ్ పెంపే లక్ష్యంగా..!

- రాష్ట్రవ్యాప్తంగా ఓటరు అవగాహన శిబిరాలు
- కొత్త ఓటర్లకు మాక్ పోలింగ్
- చర్యలు తీసుకుంటున్న అధికారులు



యువతకు ఈవీఎం, వీవీప్యాట్‌లపై అవగాహన



రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ల సమావేశం



నమూనా పోలింగు కేంద్రంలో ఓటింగ్ ప్రక్రియపై అవగాహన కార్యక్రమం

భువనేశ్వర్:

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ శాతం పెరుగుదలే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా ఓటరు చైతన్య కార్యక్రమాలు చురుకుగా కొనసాగుతున్నాయి. ప్రధానంగా కొత్తగా నమోదై తొలిసారి ఓటు హక్కు వినియోగించుకోనున్న యువజన ఓటర్లకు ఎన్నికల పోలింగు ప్రక్రియలో దశలపై అవగాహన కల్పించేందుకు రాష్ట ఎన్నికల సంఘం పలు కార్యక్రమాలు చేపడుతోంది. మండలం, జిల్లా స్థాయిలో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తోంది. ఆయా ప్రాంతాల కలెక్టర్ల ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ శిబిరాల నిర్వహణ కొనసాగుతోంది.

నమూనా పోలింగ్ కేంద్రాలు

కలెక్టర్ల ప్రత్యక్ష పర్యవేక్షణలో ఎక్కడికక్కడ నమూనా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి అవగాహన శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఈ శిబిరాలు యువతరం ఓటర్లను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఈ ప్రాంగణాల్లో ఓటింగ్ వాతావరణం తారసపడుతుంది. ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రం సందర్శన, అక్కడ అందుబాటులో ఉండే సదుపాయాలు, భద్రత, పోలింగ్ నిర్వహణ వగైరా సమాచారపూర్వక ప్రదర్శనతో ఈ ప్రక్రియలో సాంకేతిక, యాంత్రిక సౌకర్యాలను వివరిస్తున్నారు. ఓటు వేయడంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం) వినియోగం, అనుబంధ వీవీప్యాట్ ప్రాధాన్యత ప్రదర్శన సరికొత్త ఓటర్లని ఉత్సాహపరుస్తోంది. పోలింగు కేంద్రం ప్రాంగణంలో జాబితాలో ఓటరు పేరు, వివరాలు సంబంధిత సమాచారం పొందే విధానాన్ని స్పష్టంగా వివరిస్తున్నారు.

రాజకీయ పార్టీలతో సమావేశం

వివిధ బూత్‌లలో పోలింగ్ అవగాహన ప్రదర్శన కొనసాగుతోంది. అలాగే ఓటరు జాబితాలో కొత్త ఓటర్లను చేర్చడం, పోలింగ్ కేంద్రాల బదిలీ, ఇతరేతర అనుబంధ కార్యకలాపాలతో పోలింగ్ కేంద్రాల్లో తాజా మార్పు చేర్పులు వగైరా అంశాలపై కలెక్టర్లు రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు.

ఆన్‌లైన్‌లో ఓటరు నమోదు

అర్హులైన పౌరులు తమ పేరును ఓటర్ల జాబితాలో చేర్చడానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని రాష్ట ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) తెలియజేశారు. ఈ ఏడాది జనవరి 1 అర్హత తేదీగా తుది ఓటర్ల జాబితా-2024 జనవరి 5న ప్రచురించబడిందని తెలిపారు. ఈ జాబితా అన్ని బూత్ స్థాయి అధికారుల వద్ద (బీఎల్‌వో), తనిఖీ కోసం ఈఆర్‌వో కమ్ సబ్-కలెక్టర్ కార్యాలయంలో అందుబాటులో ఉందని తెలిపారు. ఓటరు జాబితాలో తాజా నమోదు కోసం ఫారమ్ 6, మైగ్రేషన్ (వలస, బదిలీ) కోసం ఫారమ్-8ని ఆన్‌లైన్‌లో లేదా ఓటరు హెల్ప్‌లైన్ యాప్‌ని డౌన్‌లోడ్ చేయడం ద్వారా పూరించవచ్చు. ఇందుకోసం ఓటర్లు బూత్ స్థాయి అధికారిని కూడా సంప్రదించవచ్చని ఎన్నికల కార్యాలయం పేర్కొంది. తాజా ఓటర్ల జాబితా ఛ్ఞాౌఛీజీటఛ్ఛి. ఃజీఛి. జీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉందన్నారు. దాని ప్రకారం ఓటర్లు తమ వివరాలను సరిచూసుకోవచ్చని వివరించారు. ఈ ఏడాది ఏప్రిల్ 1, జూలై 1, అక్టోబర్ 1 అర్హత తేదీకి సంబంధించి నమోదు చేసుకోవడానికి అర్హులైన 1,07,751 భావి ఓటర్ల అభ్యర్థన దరఖాస్తులు అందాయని సీఈవో తెలిపారు. ఈ దరఖాస్తులను గడువులోగా పరిశీలించనున్నట్లు పేర్కొన్నారు.

ఈవీఎంలపై అవగాహన


రాష్ట్రవ్యాప్తంగా ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు (ఈవీఎం), వీవీప్యాట్లపై అవగాహన నిర్వహిస్తున్నారు. ఈ నే పథ్యంలో కలెక్టర్లు, సబ్ కలెక్టర్ల కార్యాలయాల్లో ఏర్పా టు చేసిన నమూనా పోలింగ్ కేంద్రాల్లో 52 వేల మందికిపైగా మాక్ పోలింగ్‌లో పాల్గొన్నారు. మారుమూ ల ప్రాంతాల్లో సంచాలక పోలింగ్ స్టేషన్ల ప్రదర్శన చే పడుతున్నారు. ఈ కార్యక్రమం కింద ప్రదర్శన వాహనా లు 14 వేలకుపైగా పోలింగ్ స్థానాల్లో పర్యటించాయి.

దశాబ్దాల కల.. నెరవేరిన వేళ



మనబార్-జర్తి స్టేషన్ల మధ్య నిర్మితమైన వంతెన





వంతెన నిర్మాణం జరుగుతున్న దృశ్యం

కొరాపుట్: తమకు వంతెన కావాలని మూడున్నర దశాబ్దాలుగా డిమాండ్ చేస్తున్న గిరిజనుల కలను, కేవలం మూడున్నర గంటల్లో అధికారులు నెరవేరేలా చేశారు. మంగళవారం మధ్యాహ్నం 12.10 గంటలకు నిర్మాణం ప్రారంభించి సాయంత్రం 3.40కి నిర్మాణం ముగించారు. కొరాపుట్ నుంచి జయపూర్ రైల్వేస్టేషన్ల మార్గంలో మనబార్-జర్తి రైల్వేస్టేషన్ల మధ్య ఈ వంతెన నిర్మించారు. ఆ మార్గంలో ఉన్న దయానిధి గుడ గ్రామస్తులు గత 35 ఏళ్లుగా వంతెన నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు. దీనికోసం ప్రజా ప్రతినిధులను నిలదీశారు. పలుమార్లు ఎన్నికలు బహిష్కరించారు. పార్లమెంట్‌లో సైతం చర్చకు వచ్చింది. దీంతో కేంద్ర-రాష్ట ప్రభుత్వాల ఉమ్మడి ఆర్థిక సహకారంతో నిర్మాణం చేపట్టారు. వాల్తేర్ డివిజన్‌లో కొత్తవలస-కిరండోల్ లైన్‌లో అత్యాధునిక నిర్మాణ సామగ్రితో ఈ నిర్మాణం పూర్తి చేశారు. డిప్యూటీ చీఫ్ ఇంజినీర్ (కన్‌స్ట్రక్షన్స్) బీబీ మహరాణ నేతృత్వంలో ఈ విజయం సాధ్యమయింది. ఈ నిర్మాణం వలన దయానిధి గూడ గ్రామస్తులు పట్టణ ప్రాంతాలకు రాకపోకలు సాగించడానికి దూరం తగ్గింది. ఈ వంతెనను రైల్వేవర్గాలు లిమిటెడ్ హైట్ సబ్ వేగా పేర్కొంటారు.

గుణుపూర్‌లో కలెక్టర్ పర్యటన



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ మహాజన్

రాయగడ: జిల్లాలోని గుణుపూర్‌లో కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్ సోమవారం పర్యటించారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. సబ్ కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలో స్ట్రాంగ్ రూమ్, తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని మైదానంలో వాహనాల పార్కింగ్ వంటి అంశాలపై చర్చించారు. సబ్ కలెక్టర్ కిరణ్ దీప్ కౌర్ ఎన్నికల ఏర్పాట్లుకు సంబంధించి వివరాలను తెలియజేశారు. అనంతరం గుణుపూర్ సబ్ డివిజన్‌లో జరుగుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. నిర్మితమవుతున్న బైపాస్ రహదారి, సెఫాలి కొండ ప్రాంతంపై నిర్మాణం కానున్న కల్యాణ మండపం తదితర అంశాలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ దశలో ఉన్న పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయనతో పాటు గుణుపూర్ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి శాంతి ప్రభ ప్రదాన్, తహీల్దార్ లిలావతి ఆచార్జీ, బీడీవో శుభ్రాంజలి ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు.

భాషా సదస్సు సందర్శన



భాషా సదస్సు ప్రాంగణంలో మహిళా ఎమ్మెల్యేలు, మంత్రులు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రపంచ ప్రథమ ఒడియా భాషా సదస్సుని రాష్ట్ర శాసనసభ సభ్యులు మంగవారం సందర్శించారు. ఈ ప్రాంగణంలో సాహితీ, భాషాపరమైన ప్రదర్శనలతో చారిత్రాత్మక, సాంకేతిక పరిణామాలు, వైజ్ఞానిక, భౌగోళిక ప్రదర్శన శిబిరాలను ఎమ్మెల్యేలు, మంత్రులు పరిశీలించారు. కొనసాగుతున్న మధ్యంతర బడ్జెటు సమావేశాల్లో చిక్కిన స్వల్ప నిడివిలో వీరంతా ప్రభుత్వ సిటీ బస్సులో స్థానిక జనతా మైదాన్ ప్రాంగణానికి విచ్చేశారు.
- భువనేశ్వర్



ప్రాచీన కళాఖండాల ప్రదర్శన వద్ద రాష్ట్ర ఎమ్మెల్యేల బృందం



అక్షర భూమి ప్రాంగణంలో శాసనసభ సభ్యులు



వైజ్ఞానిక పరివర్తన శిబిరంలో మంత్రి టుకుని సాహు

విజృంభిస్తున్న అతిసార

- కొంతొమాలికొరొలాలో భయానక పరిస్థితి
- ఇప్పటికే నలుగురు మృతి
- పరిస్థితి సమీక్షిస్తున్న వైద్య సిబ్బంది



గ్రామంలో పర్యటిస్తున్న వైద్య బృందం సభ్యులు



అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం



అతిసారతో బాధపడుతున్న చితారాం



వ్యాధితో బాధపడుతున్న రఘునాథ్ జొడియా

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి కొంతొమాలికొరాలా గ్రామంలా అతిసారం వ్యాపించింది. ఈ వ్యాధి బారినపడి గత నాలుగు రోజుల్లో నలుగురు మృత్యువాత పడ్డారు. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటనకు సంబంధించి సమాచారం అందుకున్న వైద్య బృందం గ్రామంలో పర్యటించి పరిస్థితిని అధ్యయనం చేస్తోంది. ఈ వ్యాధి బారినపడిన కొంతమందిని టికిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అసలు ఈ పరిస్థితికి గల కారణాలను అన్వేషించేందుకు వైద్య బృందం ప్రయత్నాలు చేస్తోంది. వ్యాధితో బాధపడుతున్న వారి శాంపిల్స్‌ను పరీక్షల కోసం జిల్లా కేంద్రం ఆస్పత్రికి తరలించారు. అదేవిధంగా గ్రామస్తులు తాగుతున్న నీటిని పరీక్షించేందుకు ల్యాబ్‌కు తరలించారు.

వైద్య బృందం పర్యటన

గ్రామంలోని చంపి సహ్ను(11) అనే బాలుడికి తీవ్రంగా కడుపు నొప్పి రావడంతో పాటు వాంతులు, విరేచనాలు అవ్వడంతో మృతి చెందాడు. అదేవిధంగా కొగా జొడియా(42) అనే యువకుడు మరుసటి రోజు వ్యాధి బారినపడి మృతి చెందాడు. అలాగే అభిరాం జొడియా(50), బొనా జొడియా(47)లు వరుసగా మృతి చెందడంతో భయాందోళనకు గురైన గ్రామస్తులు టికిరిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులకు తెలియజేశారు. దీంతో వైద్య బృందం ఆదివారం, సోమవారాలు వరుసగా రెండు రోజులు పర్యటించి అక్కడి వారి ఆరోగ్య పరిస్థితిని సమీక్షించారు. రోగం బారినపడి ఉన్న రఘునాథ్ జొడియా, పునొజొడియా, రామోజొడియాలను వెంటనే అంబులెన్స్ సాయంతో జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు.

భోజనాలు తినడంతోనే..?

జనవరి 31వ తేదీ రాత్రి గ్రామంలో అందరూ కలిసి విందు భోజనాలు ఏర్పాటు చేసుకున్నారు. అయితే భోజనాలు అనంతరం ఒకొక్కరుగా వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నారు. దీంతో భోజనాల్లో ఏమైనా విష పదార్థం కలిసిందా అనే అనుమానాలను వైద్యులు వ్యక్తపరుస్తున్నారు. వ్యాధి బారినుంచి ప్రజలను కాపాడేందుకు వైద్యులు నిరంతరం కృషి చేస్తున్నారు. వేడినీరు, వేడిగా ఉన్న ఆహారాన్ని సేవించాలని ప్రజలకు చైతన్య పరుస్తున్నారు. అదేవిధంగా అంగన్‌వాడీలు, ఆశ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి జాగ్రత్తలు పాటించాలని గ్రామస్తులకు సూచిస్తున్నారు.

పరిస్థితి అదుపులో ఉంది



కొంతొమాలికొరొలాలో అతిసారం ప్రస్తుతం అదుపులో ఉంది. ఇప్పటివరకు సకాలంలో వైద్యం అందకపోవడంతో నలుగురు మృత్యువాత పడ్డారు. సమాచారం తెలుసుకున్న వెంటనే అప్రమత్తమై గ్రామానికి వైద్య బృందాన్ని తరలించాము. పరిస్థితిని సమీక్షించిన వైద్య బృందం అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటోంది. గ్రామంలో ఇంకెవ్వరికీ వ్యాధి సోకకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. వ్యాధి సోకడానికి గల కారణాల కోసం గ్రామస్తుల నుంచి రక్త నమూనాలు సేకరించి పరీక్షలకు తరలించాం. రిపోర్టులు వస్తే ఎందుకు ఇలా జరిగిందనేది తెలుస్తుంది

– డాక్టర్ లాల్ మోహన్ రౌత్రాయ్,
జిల్లా ముఖ్యవైద్యాధికారి, రాయగడ

క్లుప్తంగా

గవర్నర్ ప్రసంగంపై కృతజ్ఞతలు నేడు

భువనేశ్వర్: శాసనసభ సమావేశాల్లో గవర్నర్ ప్రసంగంపై కృతజ్ఞతలు చర్చ బుధవారం సాగనుంది. ఈ నేపథ్యంలో ప్రశాంత కుమార్ మదులి సభలో తీర్మానం ప్రవేశపెట్టారు. మధ్యంతర బడ్జెటు సమావేశాలు సందర్భంగా రాష్ట్ర గవర్నర్ రఘుబర దాస్ సభలో తొలుత ప్రసంగించిన విషయం తెలిసిందే. ఈ ప్రసంగంపై సభ్యులు సభలో కృతజ్ఞతలు తెలియజేస్తారు. ఆర్థిక మంత్రి విక్రమ్ కేశరి అరుఖ్ 8వ తేదీన సభలో 2024 – 25 ఆర్థిక సంవత్సరపు రాష్ట్ర మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెడతారు.

98 వేల ఉద్యోగాలు ఖాళీ

భువనేశ్వర్:రాష్ట్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో అధికారుల కొరత నెలకొంది. పలు పదవుల్లో ఉద్యోగాలు ఖాళీగా ఉన్నా ప్రభుత్వం భర్తీ చేయడం లేదు. ఈ వివరాలను కోరుతూ ప్రభుత్వ ఉద్యోగాల ఖాళీలపై బీజేపీ ఎమ్మెల్యే ముఖేష్ మహలింగ్ లిఖితపూర్వకంగా ప్రశ్నించారు. ఆయనకు బదులు ఇచ్చిన నైపుణ్యత అభివృద్ధి, సాంకేతిక విద్యాశాఖ మంత్రి ప్రీతి రంజన్ ఘొడై రాష్ట్ర ప్రభుత్వంలోని 41 శాఖల్లో 98,348 పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఆరోగ్య శాఖలో 26,815 ఉద్యోగాలు, పాఠశాల, సామూహిక విద్యాశాఖలో 21,844 పోస్టులు, గృహనిర్మాణ శాఖలో 7,315 ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. అదేవిధంగా రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖలో 5,829, ఉన్నత విద్యాశాఖలో 3,777, వ్యవసాయ శాఖలో 2,821 ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని వివరించారు.

రాష్ట్రంలో పెరిగిన ఉష్ణోగ్రతలు

భువనేశ్వర్: రాష్ట్రంలో పగటి పూట ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. 13 చోట్ల మంగళవారం పగటి పూట గరిష్ట ఉష్ణోగ్రత 33 డిగ్రీల సెల్సియస్ పైబడి నమోదైనట్లు స్థానిక వాతావరణ పరిశోధన కేంద్రం తెలిపింది. పర్లాకిమిడి, భవానీపట్న ప్రాంతాల్లో రాష్ట్ర స్థాయిలో అత్యధిక వేడి వాతావరణం నెలకొంది.

ప్రాంతం	గరిష్ట ఉష్ణోగ్రత (డిగ్రీల సెల్సియస్)		
పర్లాకిమిడి	35.0	ఝూర్సుగుడ	33.7
భవానిపట్న	35.0	ఢెంకనాల్	33.6
టిట్లాగఢ్	34.5	సోన్‌పూర్	33.5
మల్కన్‌గిరి	34.5	చాంద్‌బాలి	33.2
భువనేశ్వర్	34.4	భద్రక్	33.1
బొలంగీరు	33.8	కటక్	33.0
అంగుల్	33.7		

వివాహిత ఆత్మహత్య..?

పర్లాకిమిడి/కొత్తూరు: గజపతి జిల్లా కాశీనగర్ పోలీసుస్టేషన్ పరిధి ఆరో మైలు ప్రాంతంలోని జీడి తోటలో వివాహిత మృతదేహం మంగళవారం లభ్యమైంది. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీకాకుళం జిల్లా కొత్తూరు ఠాణా పరిధి బలద గ్రామానికి చెందిన గ్రామ వలంటీర్ జడ్డు ఉషారాణి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. ఆమెకు భర్త రామారావు, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఉదయం బ్యాంకు పని కోసమని చెప్పి ఆమె ఇంటి నుంచి బయల్దేరి వెళ్లింది. తీరా చూస్తే ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసింది. అయితే ఆమె మృతిపై స్థానికంగా అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. హత్య జరిగి ఉంటుందని పలువురు భావిస్తున్నారు.

కరస్రాము పోటీల్లో చిన్నారుల ప్రతిభ



పతకాలు సాధించిన చిన్నారులతో కర్రసాము సంఘ నాయకులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయస్థాయి సౌత్ జోన్ కర్రసాము పోటీల్లో శ్రీకాకుళం జిల్లా క్రీడాకారులు సత్తాచాటారు. నెల్లూరు వేదికగా ఈ నెల 4న జరిగిన పోటీల్లో సబ్ జూనియర్స్ విభాగంలో ప్రతిభ కనబరిచారు. రుప్ప నరేంద్ర నాయుడు, బగ్గు హర్షవర్ధన్‌లు ఒంటి కర్రసాము, రెండు కర్రల సాము, ఒంటి కర్ర యుద్ధం విభాగాల్లో నాలుగు బంగారు, ఒక రజతం, ఒక కాంస్య పతకం సాధించి శభాష్ అనిపించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను జిల్లా కర్రసాము అసోసియేషన్ కార్యదర్శి కె.తారకరామ, కర్రసాము ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్ష, కార్యదర్శులు కె.శ్రీహరి, జి.శ్రీనివాసరావు, రాష్ట్ర కర్రసాము అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.భాస్కరరావు, జిల్లా డిస్ట్రిక్ట్ ఉషూ అసోసియేషన్ కార్యదర్శి రెడ్డి శివకుమార్ మంగళవారం అభినందించారు.

టూరిజం పోటీలకు సిద్ధంకండి

శ్రీకాకుళం రూరల్: టూరిజం పోటీలకు విద్యార్థులు సిద్ధం కావాలని నైరా అగ్రికల్చర్ డీన్ డాక్టర్ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఈ నెల 14లోగా ఎంట్రీలను ఆన్‌లైన్‌లో పంపించాలని కోరారు. మంగళవారం నైరా కళాశాలలో విద్యార్థులతో మాట్లాడుతూ 'టూరిజం ఫర్ టుమారో' అనే అంశంపై కేస్ స్టడీ కాంపిటీషన్ తయారు చేసి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలరు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్లు అందిస్తామన్నారు. యూనివర్సిటీ విద్యార్థులు, ఎన్జీవోలు, స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అర్హులరని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా పర్యాటకశాఖాధికారి నారాయణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వాడివేడిగా అసెంబ్లీ సమావేశాలు



స్పీకర్ పాడియం ప్రాంగణంలో నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నాయకుడు నరసింగ మిశ్రా

- వేదాంత సంస్థ భూములపై కాంగ్రెస్ నిరసన
- విజిలెన్స్ విచారణకు డిమాండ్
- సభ తాత్కాలికంగా వాయిదా

భువనేశ్వర్: రాష్ట్ర శాసన సభలో మధ్యంతర బడ్జెటు సమావేశాలు వాడీవేడిగా సాగుతున్నాయి. మంగళవారం జరిగిన సమావేశాల్లో వేదాంత సంస్థ భూముల అక్రమాలపై కాంగ్రెసు శాసనసభ నాయకుడు నరసింగ మిశ్రా నిరసన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో సభా కార్యకలాపాలను స్పీకర్ ప్రమీలా మల్లిక్ పాక్షికంగా వాయిదా వేశారు. వేదాంత భూకబ్జా శీర్షికతో శూన్య గంట సమావేశం ప్రారంభమైన కాసేపటికే సాయంత్రం 4 గంటల వరకు వాయిదా వేసినట్లు ప్రకటించారు.

ప్రశ్నోత్తరాలు శాంతియుతం

మధ్యంతర బడ్జెట్ సమావేశాల రెండో రోజున సభలో ప్రశ్నోత్తరాలు శాంతియుతంగా ముగిశాయి. వెంబడి ప్రారంభమైన శూన్య గంట సమావేశంలో సభలో వాతావరణం అకస్మాత్తుగా వేడెక్కింది. నరసింగ మిశ్రా వేదాంత భూకబ్జా అంశాన్ని లేవనెత్తడంతో సభలో వాతావరణం మారిపోయింది. ఈ అంశంపై స్పీకర్ రూలింగ్ జారీ చేయడంతో విజిలెన్స్ విచారణకు ప్రభుత్వానికి ఆదేశించాలని నరసింగ మిశ్రా డిమాండ్ చేశారు. పరిశీలించిన మేరకు చర్యలకు ఆదేశించడం జరుగుతుందని స్పీకర్ ప్రకటించడంతో ఆయన సభలో ధర్నా చేపట్టారు. ఈ పరిస్థితులను అదుపులోకి తీసుకొచ్చేందుకు తాత్కాలికంగా వాయిదా వేసినట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా మిశ్రా మాట్లాడుతూ.. కొన్ని కంపెనీలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఆరోపించారు. లోక్‌పాల్, హైకోర్టు, సుప్రీంకోర్టు ఆదేశాలు వచ్చినా రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వమే అన్ని పన్నులను మాఫీ చేస్తూ వేదాంత కోసం 4 లైన్ల రహదారిని నిర్మించేందుకు అంగీకరించిందన్నారు. ఈ సంస్థపై ప్రభుత్వానికి ఎందుకు మక్కువో స్పష్టం చేయాని డిమాండ్ చేశారు.

సమస్యలు పరిష్కరించాలి

శాసనసభ సమావేశాలు పురస్కరించుకొని సమస్యలు పరిష్కరించాలని పలువురు దిగువ పీఎంజీ ప్రాంతంలో నిరసనలు తెలుపుతున్నారు. దీంతో వారి సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ప్రధాన విపక్షం భారతీయ జనతా పార్టీ చీఫ్ విప్ మోహన్ చరణ్ మాఝీ సభలో మండిపడ్డారు. ఎన్ఆర్‌జీఎస్, గాంవ్ సాథీ వర్గాలు పంచాయతీ రాజ్ విభాగం అధీనంలో ఉన్నాయి. వీరి సమస్యలపై ప్రభుత్వం నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరిస్తోందని ఆరోపించారు. పలుమార్లు ప్రభుత్వం దృష్టికి వీరి సమస్యలను తీసుకుని వెళ్లినా వైఖరిలో ఏమాత్రం మార్పు లేదని విరుచుకుపడ్డారు. గాంవ్ సాథీ 3 డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. రాష్ట్రంలో సుమారు 70 వేల మంది గాంవ్ సాథీలు ఉన్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత మంత్రి, విభాగం ఉన్నత అధికారులకు స్పీకర్ ఆదేశించాలని మోహన్ మాఝి అభ్యర్థించారు. ప్రతిపక్ష చీఫ్ విప్ మోహన్ చరణ్ మాఝీ వాదనలను కాంగ్రెస్ శాసనసభ నాయకుడు నరసింగ మిశ్రా సభలో పునరుద్ఘాటించారు. ఆందోళన చేపడుతున్న గాంవ్ సాథీ కార్యకర్తల డిమాండ్లు న్యాయ సమ్మతమేనని స్పీకర్‌కు వివరించారు.

నేటి నుంచి ఒడిశా ట్రావెల్ బజార్



మాట్లాడుతున్న సురేంద్ర కుమార్

భువనేశ్వర్: రాష్ట్రంలో 5వ ఒడిశా ట్రావెల్ బజారు కార్యక్రమం బుధవారం నుంచి ప్రారంభమవుతుంది. ఈ కార్యక్రమంలో భాగంగా పర్యాటక రంగంలో పలు జాతీయ, అంతర్జాతీయ క్రయవిక్రేతల ప్రత్యక్ష సమావేశం జరుగుతుంది. ఈకో రీట్రీట్ కోణార్కు వేదికగా ఈనెల 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. ట్రావెల్, టూరు ఆపరేటర్లు, డెస్టినేషను నిర్వహణ కంపెనీలు (డీఎంసీ) ఒక చోట చేరి రాష్ట్రంలో ప్రోత్సాహకరమైన పర్యాటక అవకాశాలను తెలుసుకుంటారు. దీంతో రాష్ట్ర పర్యాటక రంగం పురోగతి ఊపందుకుంటుందని ప్రభుత్వం యోచిస్తుందని రాష్ట్ర పర్యటన శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి సురేంద్ర కుమార్ తెలిపారు. ఆయనతో విభాగం డైరెక్టర్ సచిన్ రామచంద్ర జాదవ్, ఒడిశా పర్యటన అభివృద్ధి సంస్థ ఓటీడీసీ అధ్యక్షుడు లెనిన్ మహంతి, ఫిక్కీ జాతీయ పర్యటన కమిటీ కో-చైర్మన్ డాక్టర్ జె.కె.మహంతి విలేకర్ల సమావేశంలో మంగళవారం మాట్లాడారు. ఈసారి జరగనున్న ఒడిశా ట్రావెల్ బజారు కార్యక్రమానికి దేశ, విదేశాల నుంచి పేరొందిన పలు సంస్థలు విచ్చేస్తున్నాయన్నారు. దేశంలో 18 రాష్ట్రాల నుంచి 70 స్వదేశీ టూరు ఆపరేటర్లు, 16 విదేశాల నుంచి 60 మంది అంతర్జాతీయ టూరు ఆపరేటర్లు పర్యాటక రంగం క్రయవిక్రేతల భేటీకి విచ్చేస్తున్నట్లు పేర్కొన్నారు. బెల్జియం, ఇండోనేషియా, మలేషియా, మయన్మార్, నెదర్లాండ్స్, సింగపూర్, దక్షిణ ఆఫ్రికా, స్పెయిన్, శ్రీలంక, థాయిలాండ్, టర్కీ, యునైటెడ్ కింగ్‌డమ్, వియత్నామ్ ప్రాంతాల నుంచి అంతర్జాతీయ టూరు ఆపరేటర్లు విచ్చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రపంచ ప్రామాణికాలతో రాష్ట్రాన్ని విభిన్న పర్యాటక కేంద్రంగా మలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒడిశా ట్రావెల్ బజారు కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఒడిశా పర్యటన అభివృద్ధి సంస్థ (ఓటీడీసీ) అధ్యక్షుడు లెనిన్ మహంతి తెలిపారు. ఇటీవల కాలంలో రాష్ట్ర క్రీడారంగం పర్యాటక కేంద్రంగా జాతీయ, అంతర్జాతీయ పర్యాటకుల్ని ఆకట్టుకుంటుందని జె.కె.మహంతి తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో పలు అంతర్జాతీయ విమానయాన సౌకర్యాలు అందుబాటులోకి రానున్నట్లు తెలిపారు. కోవిడ్ తాకిడితో కుప్పకూలిన రాష్ట్ర పర్యాటక రంగం ఇప్పుడిప్పుడే కోలుకుంటుందన్నారు.

ఈ ఏడాది చివరకు అన్ని గ్రామాలకు తాగునీరు



వివరాలు వెల్లడిస్తున్న మంత్రి ప్రదీప్ కుమార్ అమత్

- మంత్రి ప్రదీప్ కుమార అమత్

భువనేశ్వర్: అసెంబ్లీ మధ్యంతర బడ్జెటు సమావేశాలు పురస్కరించుకుని ప్రారంభమైన ప్రశ్నోత్తరాల్లో పలు ప్రశ్నలకు అనుబంధ శాఖల మంత్రుల నుంచి వివరణాత్మక బదులు లభించడం విశేషం. గ్రామీణ ప్రాంతాలకు కుళాయి తాగునీరు వ్యవస్థకు సంబంధించిన ప్రశ్నలకు పంచాయతీరాజ్, తాగునీటి శాఖ మంత్రి ప్రదీప్ కుమార అమత్ సమాధానం తెలిపారు. ఈ ఏడాది చివరి నాటికి రాష్ట్రంలోని అన్ని గ్రామాలకు కుళాయి ద్వారా తాగునీరు అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. జల వనరులు, భూసేకరణ వంటి అనివార్య ఇబ్బందులు తలెత్తే చోట్ల వచ్చే ఏడాది మార్చి నాటికి కుళాయి ద్వారా తాగునీరు సరఫరా అవుతుందన్నారు. మార్చి 2023 నాటికి రాష్ట్రంలో 58 శాతం గ్రామాలకు కుళాయి ద్వారా తాగునీరు సరఫరా అవుతుంది. ఈ సౌకర్యం లేని చోట, పనులు నత్తనడకన సాగుతున్న చోట్ల కొత్త గొట్టపు బావులు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్, పీడీ డీఆర్‌డీఏ, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులను ఆదేశించారు. కొత్తగా ఏర్పడిన జనావాస ప్రాంతాల్లో అదనపు గొట్టపు బావులు ఏర్పాటు చేయనున్నారు. 70 మంది జనాభా కనీస ప్రామాణికంగా కొత్త గొట్టపు బావులు ఏర్పాటు చేసేందుకు ఆదేశించినట్లు మంత్రి వివరించారు. జిల్లా కలెక్టర్ స్థానిక ప్రజాప్రతినిధుల తనిఖీ నివేదిక ఆధారంగా కొత్త గొట్టపు బావులు ఏర్పాటు చేస్తారు. అయితే గొట్టపు బావులు లేదా పైపులు ఉన్న చోట కొత్త గొట్టపు బావులు ఏర్పాటు చేసే యోచన లేదని స్పష్టం చేశారు. తాగునీటి సమస్య తలెత్తితే 1916 హెల్ప్‌లైన్ నంబర్ ద్వారా అధికార యంత్రాంగానికి సమాచారం అందించే వ్యవస్థ ఉందని సభలో సమాధానమిచ్చారు.

తెంతులిగుమ్మలో జన సంపర్క్ శిబిరం



విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌లు అందజేస్తున్న దృశ్యం



సహిద్ లక్ష్మణ్ నాయిక్ మనవడు మధు నాయిక్‌ను సత్కరిస్తున్న బీఎస్ఎఫ్ అధికారులు



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న జవాన్లు



గిరిజనులకు వైద్య సేవలు అందజేస్తున్న దృశ్యం

మల్కన్‌గిరి: జిల్లాలోని మత్తిలి సమితి తెంతులిగుమ్మలో బీఎస్ఎఫ్ 2వ బెటాలియన్ జవాన్లు జన సంపర్క్ శిబిరంతో పాటు ఉచిత వైద్య శిబిరాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. ముందుగా ఇక్కడ సహిద్ లక్ష్మణ్ నాయిక్ విగ్రహం వద్ద నివాళులర్పించి అక్కడే శిబిరం ఏర్పాట్లు చేశారు. ఇక్కడి ప్రజలకు నిత్యావసర సరుకులతో పాటు మహిళలకు చీరలు, యువకులకు స్పోర్ట్స్ కిట్లు, వృద్ధులకు దుప్పట్లు, విద్యార్థులకు స్కూల్‌బ్యాగ్‌లు అందజేశారు. అలాగే వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. శిబిరానికి హాజరైన సుమారు 600 మందికి భోజనాలు ఏర్పాటు చేశారు. అనంతరం సహిద్ లక్ష్మణ్ నాయిక్ మనవడు మధు నాయిక్‌ను సత్కరించారు. కార్యక్రమంలో బెటాలియన్ కమాండర్ సికిందర్ సింగ్, మత్తిలి ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ కూనాల్ అంకిత్, భార్గవి దొర, సోమాకాంత్ పాణిగ్రాహి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల వేతనాలు పెంచాలి

- పార్లమెంట్‌లో గళమెత్తిన ఎంపీ ఉల్క



పార్లమెంట్‌లో మాట్లాడుతున్న కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉల్క


కొరాపుట్: రాష్ట్రంలోని అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల వేతనాలను పెంచాలని రాష్ట్రానికి చెందిన కాంగ్రెస్ ఎంపీ సప్తగిరి ఉల్క పార్లమెంట్‌లో మంగళవారం గళమెత్తారు. సరిపడా వేతనాలు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్కర్లకు రూ.20 వేల నుంచి రూ.25 వేల వేతనం, హెల్పర్లకు రూ.15 వేల వేతనం అందజేయాలని విజ్ఞప్తి చేశారు. కొరాపుట్, రాయగడ జిల్లాల్లోని కొండ ప్రాంతాల్లో నివసిస్తున్న హరిజనులకు ఆదివాసీ కేటగిరి ఇవ్వాలన్నారు. వీరు అటవీ ప్రాంతాల్లో నివసిస్తూ గిరిజన సాంప్రదాయలను పాటిస్తున్నారన్నారు. డొంబో జాతి పేరుతో పిలవబడుతూ 20 శాతం మంది నివసిస్తున్నారని పేర్కొన్నారు. వారికి ఆదివాసీ చట్టాలు వర్తించడం లేదన్నారు. కావున డొంబో జాతిని గిరిజన జాతిగా గుర్తించి ఉపాధి, విద్య తదితర అంశాల్లో తగిన ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అవిభక్త కొరాపుట్ జిల్లాలో విస్తారంగా బీడి ఆకుల సాగు జరుగుతుందన్నారు. వీటిని గిరిజనులు అటవీ ప్రాంతంలో సేకరిస్తారన్నారు. కానీ కేంద్ర ప్రభుత్వం 18 శాతం జీఎస్టీ విధిస్తోందని, దానిని 5 శాతంగా మార్చాలని విజ్ఞప్తి చేశారు. ఇది గిరిజన ఉపాధి అంశంగా ఎంపీ అభివర్ణించారు.

చిత్రకొండ సమితిలో మావో పోస్టర్లు

మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ సమితి పప్పులూర్ పంచాయతీ బంగాపూట్, రంగబెల్, కొండూరం గ్రామాల్లో మంగళవారం మావో పోస్టర్లు వెలిశాయి. మావోయిస్టు సెక్రటరీ గణేష్ పేరున ఈ పోస్టర్లు ప్రత్యక్షమయ్యాయి. మావోయిస్టు దళంలో పనిచేసిన రమేష్, రాకేశ్, స్వప్న, తులసీ, సంతు అనే ఐదుగురు వ్యక్తులు పార్టీకి ద్రోహం చేసి నెల రోజుల క్రితం వెళ్లిపోయినట్లు పోస్టర్లలో పేర్కొన్నారు. వీరు ఆంధ్ర-ఒడిశా సరిహద్దుల్లోని పలు గ్రామాల్లో కాంట్రాక్టర్లు, ప్రజల వద్ద డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. వీరికి ఎటువంటి సాయం చేయవద్దని ప్రజలకు సూచించారు. ఒకవేళ వారు నిత్యవసర సరుకులు అడిగితే బంధించి సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ పోస్టర్లు తెలుగు, ఒడియా భాషల్లో ఉన్నాయి. ఈ విషయం తెలియడంతో జిల్లా పోలీసులు అప్రమత్తమై కూంబింగ్ ముమ్మరం చేశారు.



పప్పులూర్ పంచాయతీలో వెలిసిన పోస్టర్లు



బాంగపూట్‌లో చెట్టుకు అతికించిన పోస్టర్లు

వాణిజ్య పంటలకు ప్రకృతి వ్యవసాయమే మేలు



కమ్మసిగడాంలో అంతర పంటలను పరిశీలిస్తున్న ఒడిశా బృంద సభ్యులు

రణస్థలం: ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో వాణిజ్య పంటలు పండిస్తే రైతుకు ఎంతో లాభదాయకమని ప్రకృతి వ్యవసాయం అసిస్టెంట్ గోవింద రెడ్డి అన్నారు. రణస్థలం మండలం కమ్మసిగడాం, అర్జునవలస, బంటుపల్లి, కొండములగాం ప్రాంతాల్లో ఒడిశాకు చెందిన 50 మంది రైతుల బృందం క్షేత్ర స్థాయిలో పర్యటించి ప్రకృతి వ్యవసాయ పంటలను పరిశీలించారు. పామాయిల్ తోటల్లో అంతర పంటలైన బొప్పాయి, వంగ, టమాట, అరటి పంటల సాగు విధానంపై ఆరా తీశారు. పొలం గట్లపై పెసర, మినుము పంటలు వేస్తే కలుపు నివారణకు నత్రజనిగా ఉపయోగపడుతుందని చెప్పారు. ప్రతి 15 రోజులకు ఒకసారి ఎకరాకు 200 లీటర్ల ద్రవ జీవామృతం పిచికారి చేస్తే బొప్పాయిలో వైరస్ తెగులు ఉండదన్నారు. ఆవు పేడ, మూత్రం, ఇంగువ ద్రావణంగా చేసి జీవామృతంగా తయారు చేసి పిచికారి చేయాలని సూచించారు. ఏటీఎం మోడల్‌లో పండించిన కూరగాయలు పరిశీలించారు. ఒడిశా బృంద సభ్యులు మాట్లాడుతూ ఏటీఎం మోడల్‌లో కూరగాయల పంటలు, ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో వాణిజ్య పంటలు చక్కగా పండిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఒరియా ట్రాన్స్‌లేటర్ కృపానందం, మాస్టర్ ట్రైనర్ కంబపు కృష్ణ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా శ్రీముఖలింగేశ్వరుని తిరువీధి



అలంకరణలో ఉత్సవ మూర్తులు



తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో పుష్యమాసం మంగళవారం బహుళ ఏకాదశి సందర్భంగా మధుకేశ్వరుని తిరువీధి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా స్వామివారికి ఏకవార అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పార్వతి పరమేశ్వరుల ఉత్సవ మూర్తులను చక్కగా అలంకరించి పల్లకిలో ఆశీనులుగా చేశారు. మంగళవాయిద్యాలు నడుమ తిరువీధి నిర్వహించగా భక్తులు హారతులిచ్చారు. కార్యక్రమంలో అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో కొత్తూరు విద్యార్థుల ప్రతిభ



విజేతలకు పతకాలు అందజేస్తున్న సినీ నటుడు సుమన్

కొత్తూరు: విశాఖపట్నంలోని రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 4, 5 తేదీల్లో యునైటెడ్ షోటోకన్ కరాటే డు ఇండియా సంస్థ ఆధ్వర్యంలో అండర్-13 విభాగంలో నిర్వహించిన ఇంటర్నేషనల్ కరాటే చాంపియన్‌షిప్-2024 పోటీల్లో కొత్తూరు బ్రిలియంట్ స్కూల్‌కు చెందిన 20 మంది విద్యార్థులు సత్తాచాటారు. 6 బంగారు, 3 వెండి, 4 కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. వీరంతా సినీనటుడు సుమన్ చేతుల మీదుగా పతకాలు, ప్రశంసా పత్రాలు అందుకున్నారు. విజేతలతో కలిసి స్కూల్ నిర్వాహకులు కొత్తూరులో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

జలుమూరు: చల్లవానిపేట వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. పలాసకు చెందిన డి.వీర్రాజు, శ్రీనివాస్ పెళ్లి కార్డులు పంచేందుకు చల్లవానిపేట నుంచి బుడితి ద్విచక్రవాహనంపై వస్తుండగా రోడ్డు క్రాస్ చేస్తున్న మరో వాహనచోదకుడు శ్రీరాములు అడ్డురావడంతో ఢీకొట్టాడు. ఈ ఘటనలో వీర్రాజు తలకు బలమైన గాయం కావడంతో 108 సిబ్బంది బాలరాజు రిమ్స్‌లో చేర్పించి చికిత్స అందించారు.శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు ఏఎస్సీ బి.లక్ష్మీనారాయణ కేసు నమోదు చేశారు.

టెన్త్‌లో శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం



మాట్లాడుతున్న బీసీ సంక్షేమాధికారి అనూరాధ

నరసన్నపేట: ప్రభుత్వ వసతి గృహాల్లో పదో తరగతిలో శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా విద్యార్థులను సిద్ధం చేస్తున్నామని జిల్లా బీసీ సంక్షేమాధికారి ఈ.అనూరాధ అన్నారు. నరసన్నపేటలోని దేశవానిపేట బాలికల బీసీ వసతి గృహంలో పదో తరగతి విద్యార్థులకు మంగళవారం ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ సూచనలు, కలెక్టర్ ఆదేశాల మేరకు వసతి గృహాల్లో పదో తరగతి విద్యార్థులకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఆయా ప్రాంతాల్లో నిపుణులైన సబ్జెక్టు ఉపాధ్యాయులతో మెలకువలు చెప్పిస్తున్నామన్నారు. మేట్రిన్లు కూడా బాధ్యతగా వ్యవహరించి శతశాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ త్రినాథరావు, మేట్రిన్లు, వార్డెన్లు పి.పద్మావతి, దేవి, శ్రీలక్ష్మి, లక్ష్మణరావు, ఉపాధ్యాయులు బి.కేశవరావు, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బోటు బోల్తా: మత్స్యకారుడి మృతి



బ్రహ్మాజీ మృతదేహం

పూసపాటిరేగ: మండలంలోని చింతపల్లి తీరంలో మంగళవారం వేకువ జామున జరిగిన బోటు ప్రమాదంలో ఓ మత్స్యకారుడు మృతిచెందాడు. ఈ ప్రమాదానికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. చింతపల్లి గ్రామానికి చెందిన బర్రి బ్రహ్మాజీ (33) ఎప్పటి లాగానే తోటి మత్స్యకారులతో కలిసి మంగళవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో చింతపల్లి తీరంలో సముద్రంలోకి చేపల వేటకు బయలుదేరి వెళ్లారు. వేటకు బయలుదేరిన కొద్ది సమయానికే కెరటాలు ఉధృతంగా రావడంతో బోటు బోల్తా పడింది. ఆ ప్రమాదంలో బ్రహ్మాజీ అక్కడికక్కడే మృతిచెందాడు. మిగతా మత్స్యకారులు సురక్షితంగా ఒడ్డుకు చేరారు. కొంతసేపు తరువాత తోటి మత్స్యకారులు బ్రహ్మాజీ మృతదేహాన్ని సముద్రం నుంచి ఒడ్డుకు చేర్చారు. బ్రహ్మాజీకి భార్య సుభద్ర, పిల్లలు భాను, దిల్లేష్ ఉన్నారు. ఫిర్యాదు మేరకు పూసపాటిరేగ ఎస్సై ఎ.సన్యాసినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సారా బట్టీలపై పోలీసుల దాడులు



సారా బట్టీలను ధ్వంసం చేస్తున్న పోలీసులు

వీరఘట్టం: మండలంలోని బల్లగుడ్డి పరిసర ప్రాంతంలో సారా తయారు చేస్తున్నట్లు వచ్చిన సమాచారంతో మంగళవారం ఉదయం ఎస్సై ఎం.గోవింద్ సిబ్బందితో కలిసి సారా బట్టీలపై దాడులు చేశారు. ఈ సందర్భంగా సారా తయారీకి సిద్ధం చేసిన 800 లీటర్ల బెల్లం ఊటలు ధ్వంసం చేసినట్లు ఎస్సై తెలిపారు. పోలీసులు వస్తున్నట్లు తెలియడంతో సారా తయారీదారు ఆరిక బాపయ్య పరారైనట్లు ఎస్సై చెప్పారు.

వంతెనపై అదుపు తప్పిన వ్యాన్



అదుపు తప్పిన వ్యాన్

కురుపాం: మండలంలోని గుమ్మగదబవలస గ్రామ సమీపంలో ఉన్న వంతెన పై మంగళవారం సాయంత్రం ఓ వ్యాన్ అదుపు తప్పింది. పార్వతీపురం నుంచి గుమ్మలక్ష్మీపురం డిగ్రీకళాశాలకు పరీక్ష పేపర్స్ తీసుకు వెళ్తుండగా అదుపుతప్పి గోడపై వ్యాన్ నిలబడిపోయింది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదని స్థానికులు చెబుతున్నారు. వంతెనకు ఇరువైపులా రక్షణ గోడలు లేక పోవడంతో ఇప్పటికే పలు ప్రమాదాలు జరిగాయని, అధికారులు స్పందించి రక్షణగోడలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



తలకు తీవ్రగాయాలైన కొండగొర్రి సూర్యనారాయణ

కురుపాం: మండల కేంద్రం సమీపంలోని మూలిగూడ జంక్షన్ వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్రవాహన చోదకుడికి తీవ్ర గాయాలయ్యాయి. గుమ్మిడిగూడ పంచాయతీ దండుసూర గ్రామానికి చెందిన కొండగొర్రి సూర్యనారాయణ తన ద్విచక్రవాహనంతో కురుపాం వైపు వస్తుండగా జంక్షన్ వద్ద పోలీసులు ఏర్పాటు చేసిన వేగనియంత్రణ బోర్డులను ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108కు సమాచారం ఇవ్వగా కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్య చికిత్స కోసం పార్వతీపురం ఏరియా ఆస్పత్రికి తరలిచారు. ఈ మేరకు కురుపాం ఎస్సై షణ్ముఖరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈకేవైసీ తప్పనిసరి

రేగిడి: మండలంలోని ప్రతీ రైతు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని ఏఓ జి.మురళీకృష్ణ సూచించారు. మండలంలోని ఉప్పర్నాయుడువలస, చాటాయివలస, వన్నలి తదితర గ్రామాల్లో జరుగుతున్న ఈకేవైసీని మంగళవారం పరిశీలించారు. రైతులు పండించిన పంటను రైతు భరోసా కేంద్రాలకు విక్రయించాలంటే తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు.

అమ్మ ఆశీర్వాదం కోసం

- మూడో జాతరకూ పోటెత్తిన భక్తజనం
- దర్శించేందుకు బారులు తీరిన భక్తులు
- క్యూలు నిండిపోవడంతో ఎండలో నిరీక్షణ



మొక్కు చెల్లిస్తున్న పాచిపెంట ఎంపీపీ ప్రమీల



ట్రాక్టర్‌పై జాతరకు వస్తున్న భక్తులు



పోలమాంబ అమ్మవారు



జెడ్పీచైర్మన్ కుమార్తె సిరిసహస్రను స్వాగతిస్తున్న దేవాదాయశాఖ అధికారులు



మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి మూడవ జాతర మంగళవారం కనులపండువగా జరిగింది. తెల్లవారుజామునుంచి భక్తులు గ్రామానికి తరలివచ్చారు. సుదూర ప్రాంతాలనుంచి భక్తులు ట్రాక్టర్లతో అధికంగా వచ్చారు. తొలి, మారుజాతరలకు మించి భక్తులు మూడవ జాతరకు చేరుకోవడంతో, క్యూలన్నీ నిండిపోయాయి. దీంతో భక్తులు గోముఖి బ్రిడ్జివరకు ఎండలో అమ్మ దర్శనానికి వేచి చూడాల్సి వచ్చింది. భక్తులు ఇబ్బందులు పడకుండా సీఐ జె.బాలకృష్ణ, ఎస్సై నరసింహమూర్తి, ఈవో వీవీ సూర్యనారాయణలు చర్యలు చేపట్టారు.

అమ్మవారిని దర్శించుకున్న భక్తులు

చదురుగుడిలో కొలువైన పోలమాంబ అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. అలాగే వనంగుడిలో ఉన్న పెదపోలమాంబ అమ్మవారిని, ఆలయం వెనుకన ఉన్న వేపచెట్టుకు భక్తులు పూజలు చేశారు. కోళ్లు, చీరలు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. వనంగుడి సమీపంలో భక్తులు భోజనాలు వండి, ఆరగించారు. పలువురు భక్తులు అమ్మవారికి తలనీలాలు సమర్పించారు.

అమ్మవారిని దర్శించిన చిన్నశ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు పోలమాంబ అమ్మవారిని జెడ్పీచైర్‌పర్సన్ మజ్జి శ్రీనివాసరావు తనయ, చిన్నశ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరిసహస్ర దర్శించుకున్నారు. ఈవో వి.వి. సూర్యనారాయణ ఆమెను సాదరంగా స్వాగతించి, అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించారు. అలాగే పాచిపెంట ఎంపీపీ బర్నాన ప్రమీల, సాలూరు ఏఎంసీ చైర్మన్ దండి అనంతకుమారిలు అమ్మవారిని దర్శించుకున్నారు.



క్యూలో భక్తులు



ఎండలో వేచి ఉన్న భక్తులు

11న గ్రూప్-2 ఎగ్జామ్‌పై మాక్ టెస్ట్

- ధీర ఫౌండేషన్ అధినేత సందీప్‌బాబు



గ్రూప్-2 ఎగ్జామ్ మాక్‌టెస్టు నిర్వహణపై మాట్లాడుతున్న ధీర ఫౌండేషన్ అధినేత సందీప్‌బాబు

చీపురుపల్లిరూరల్(గరివిడి): ఈనెల 11న జరగనున్న గ్రూప్-2 ఎగ్జామ్‌ను దృష్టిలో ఉంచుకుని ఉత్తరాంధ్రలోని విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం ప్రాంతాల్లో మాక్‌టెస్ట్ నిర్వహించనున్నామని, ఆయా ప్రాంతాలకు చెందిన అభ్యర్థులు ఈమాక్ టెస్టును సద్వినియోగం చేసుకోవాలని ధీర ఫౌండేషన్ అధినేత బొత్స సందీప్‌బాబు తెలిపారు. ఈ మేరకు గరివిడిలోని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో గ్రూప్-2 మాక్‌టెస్టు నిర్వహణపై విలేకరులతో ఆయన మంగళవారం మాట్లాడారు. ఈ సందర్భంగా మాక్ టెస్టు రాయబోయే అభ్యర్థులు dheerafoundation.com వెబ్‌సైట్‌లో లింకు ఓపెన్ చేసి తమ వివరాలను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. ఈ లింకులో రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి ఈ నెల 9వ తేదీన ఎగ్జామినేషన్ సెంటర్ వివరాలను ఎంఎంఎస్, వాట్సాప్ మెసెజ్‌ల రూపంలో తెలియజేయనున్నట్లు చెప్పారు. కాంపిటేటివ్ పరీక్షలను దృష్టిలో ఉంచుకుని ధీర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా స్టడీ మెటీరియల్స్‌ను పంపిణీ చేస్తున్నామని, జిల్లాలోని అన్ని గ్రంథాలయాలకు స్టడీ మెటీరియల్స్‌ను అందించామని పేర్కొన్నారు. గ్రూప్స్ ఎగ్జామ్స్‌కు ప్రిపేరవుతున్న అభ్యర్థులను దృష్టిలో ఉంచుకుని వారికి మోడల్ పేపర్‌ను తెలియజేయాలనే ఆలోచనతోనే ఈమాక్ టెస్టు నిర్వహిస్తున్నామన్నారు. గ్రూప్స్ ఎగ్జామినేషన్ పేపర్లను, మారిన సిలబస్‌ను దృష్టిలో ఉంచుకుని మాక్‌టెస్ట్ పేపర్లను రూపొందించినట్లు తెలిపారు. ఈ మాక్‌టెస్ట్‌కు హాజరయ్యే వారికి ఉచితంగా ఆన్‌లైన్ మెటీరియల్‌ను అందిస్తామన్నారు. పోటీ పరీక్షలకు ప్రిపేరవుతున్న అభ్యర్థులు సబ్‌స్క్రైబ్ అయ్యేందుకు ఎటువంటి రుసుము చెల్లించనవసరం లేదన్నారు. విద్య, ఉపాధి కల్పనకు చేదోడుగా నిలబడడమే ధీర ఫౌండేషన్ లక్ష్యమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో గరివిడి జెడ్పీటీసీ వాకాడ శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు, మాజీ ఎంపీపీ కొణిశ కృష్ణంనాయుడు, చీపురుపల్లి మండల నాయకులు ఇప్పిలి అనంతం, జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనువాసులనాయుడు, యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ, ఏఎంసీ చైర్మన్ దన్నాన జనార్దన్, రెండు మండలాలకు చెందిన సర్పంచులు, ఎంపీటీసీలు, పీఏసీఎస్ అధ్యక్షులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



రామునాయుడు(ఫైల్)

జామి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన జామి మండలకేంద్రానికి చెందిన గొర్లె రామునాయుడు(24) విశాఖపట్నంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. ఈ ప్రమాదంపై మృతుడి తల్లిదండ్రులు అప్పలనారాయణ, రమణమ్మ తెలియజేసిన వివరాలిలా ఉన్నాయి. రామునాయుడు మూడురోజుల క్రితం జామి నుంచి విశాఖపట్నం బైక్‌పై వెళ్తున్న సమయంలో తగరపువలసలో అవంతి కళాశాల వద్ద ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో విశాఖపట్నంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు తెలిపారు.

పుష్పాలంకరణలో పైడితల్లి



పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు మంగళవారం చదురుగుడి, వనంగుడిలలో పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. అనంతరం ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, మూలా పాపారావులు శాస్త్రోక్తంగా నిత్య పూజాదికాలు నిర్వహించారు. మహిళలు అమ్మవారిని దర్శించుకుని పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారిణి కేఎల్.సుధారాణి పర్యవేక్షించారు.

వెబ్‌సైట్‌లో ఫైనల్ మెరిట్‌జాబితా

- ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మలీల

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ వైద్య కళాశాల, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రుల్లో ఖాళీల భర్తీకి సంబంధించి 9.11.2023 న ఇచ్చిన నోటిఫికేషన్‌లో బయో మెడికల్ టెక్నీషియన్, కార్డియాలజీ టెక్నీషియన్, ఓటీ టెక్నీషియన్ పోస్టులకు సంబంధించిన ఫైనల్ మెరిట్ జాబితాను విజయనగరం.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో పొందుపరిచామని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలీల మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్లంబర్ ఉద్యోగాన్ని ఏపీవీపీ ఉద్యోగితో నింపినట్లు తెలియజేశారు. ఈఎంటీ మూడు ఉద్యోగాలకు సంబంధించి ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ ఆదేశానుసారం రివైజ్డ్ నోటిఫికేషన్ వెబ్‌సైట్‌లో పెట్టినట్లు తెలిపారు.

ప్రతిభా పాఠశాల, కళాశాలల్లో ప్రవేశాలకు ఆహ్వానం



మల్లిలోని ప్రతిభా కళాశాల

సీతంపేట: ఆంధ్రప్రదేశ్ గిరిజన గురుకుల సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిభా పాఠశాల, కళాశాలల్లో గిరిజన విద్యార్థుల ప్రవేశాలకు సొసైటీ రాష్ట్ర వైస్‌చైర్మన్ కాంతిలాల్ దండే నోటిఫికేషన్ జారీ చేశారు. ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో చేరడానికి మల్లి, జోగింపేట కళాశాలలు పార్వతీపురం మన్యం జిల్లాలో ఉన్నాయి. అలాగే స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో 8వ తరగతికి జోగింపేటలో ప్రవేశం కల్పించనున్నారు. ఈనెల 10వ తేదీ నుంచి వచ్చేనెల 25 వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో డబ్ల్యూ.డబ్ల్యూ.డబ్ల్యూ. ఏపీటీడబ్ల్యూగురుకులం.ఏపీ.జీఓవీ.ఇన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఏప్రిల్ 7వ తేదీన ఉదయం 10.30 గంటల నుంచి 1 గంట వరకు రాతపరీక్ష నిర్వహించనున్నారు.

గిరిజన గురుకులాల్లో ఐదో తరగతి ప్రవేశాలు

2024-25 విద్యాసంవత్సరానికి గాను ఐదోతరగతిలో ప్రవేశానికి, 6వ తరగతి నుంచి 9 వరకు మిగులు సీట్లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నారు. వివిధ జిల్లాల్లో ఏజెన్సీ, నాన్‌ఏజెన్సీ పరిధిలో విద్యార్థులను రాత పరీక్ష ద్వారా ఎంపిక చేయనున్నారు. ఐదోతరగతిలో ప్రవేశానికి నాలుగో తరగతి పాసై ఉండాలి. మిగిలిన తరగతులకు వారి ముందు తరగతులు చదివి ఉత్తీర్ణులైన వారు అర్హులు.

అర్హతలు ఇలా..

ఐదోతరగతిలో ప్రవేశానికి ఓసీ, బీసీ, కులాలకు చెందిన విద్యార్థులు 1.6.2013 నుంచి 31.07.2015 మధ్య జన్మించి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 1.6.2011 నుంచి 31.7.2015 మధ్య జన్మించి ఉండాలి. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.లక్షకు మించి ఉండరాదు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో చదివి ఉండాలి. పూర్తి సమాచారంతో కూడిన సమాచార పత్రం, దరఖాస్తు కోసం ఈనెల 15 నుంచి వెబ్‌సైట్‌లో చూడవచ్చు. ఏప్రిల్ 10వ తేదీలోగా దరఖాస్తులు సమర్పించుకోవాలి. ఇతర వివరాలకు సంబంధిత పాఠశాలల ప్రిన్సిపాల్స్‌ను సంప్రదించాలని ఉత్తర్వుల్లో సూచించారు.

అంతర్‌జాతీయ కరాటే పోటీల్లో బంగారుపతకం



లక్ష్మీదీపక్‌ను అభినందిస్తున్న కరస్పాండెంట్ మహేశ్వరరావు తదితరులు

కొత్తవలస: మండలంలోని తుమ్మికాపల్లి గేటు సమీపంలో గల వాగ్దేవి జూనియర్ కళాశాలలో ఇంటర్‌మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎల్.లక్ష్మీదీపక్ అంతర్‌జాతీయ కరాటే పోటీల్లో బంగారుపతకం సాధించినట్లు కరస్పాండెంట్ కొట్ని మహేశ్వరరావు తెలిపారు. ఈ నెల 3,4 తేదీల్లో విశాఖపట్నంలో గల పోర్టు స్టేడియంలో ఆల్ స్టైల్ ఇంటర్‌నేషనల్ 7వ కరాటే పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో లక్ష్మీదీపక్ అండర్-16 విభాగంలో బంగారుపతకం, అండర్-17 విభాగంలో సిల్వర్ పతకాన్ని సాధించినట్లు తెలిపారు. ఈమేరకు కళాశాల ఆవరణలో మంగళవారం ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసి లక్ష్మీదీపక్‌ను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ మొయిద లక్ష్మణరావు, కుమార్‌బాబు, బోధన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల అభ్యున్నతికి జీసీసీ కృషి



గిరిజనులతో మాట్లాడుతున్న మేనేజింగ్ డైరెక్టర్ సురేష్‌కుమార్

పార్వతీపురం టౌన్: గిరిజనుల అభివృద్ధికి జీసీసీ కృషిచేస్తోందని, జీవన నైపుణ్యాలు పెంపొందించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించిందని గిరిజన సహకార సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ జి.సురేష్ కుమార్ తెలిపారు. పార్వతీపురం మండలం దేవుకోన, రావికోన, అడారు గ్రామాల్లో మహిళా స్వయంసహాయక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వన్‌ధన్ వికాస్ కేంద్రాలను ఆయన మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరా క్రాంతి పథంతో కలిసి రాష్ట్ర వ్యాప్తంగా 415 వన్‌ధన్ వికాస్ కేంద్రాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గిరిజనులు పండించే అటవీ వ్యవసాయ ఉత్పత్తులకు మంచి మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జీసీసీ డీఎం మహేంద్రకుమార్, వెలుగు ఏపీడీ సత్యంనాయుడు, మార్కెటింగ్ మేనేజర్ శేఖర్, రమణమూర్తి, ప్రవీణ్, ఇందిరాక్రాంతి పథం అధికారులు, జీసీసీ సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మ గెలిచింది

ఆమెకు ముగ్గురు కుమార్తెలు పుట్టడంతో భర్త విడిచిపెట్టాడు. అయినా, ఆమె కుంగి పోలేదు. కాయకష్టాన్ని నమ్ముకుంది. భవన నిర్మాణ కార్మికురాలిగా మారింది. వచ్చిన కూలిడబ్బులతో పిల్లలను సాకింది. ప్రభుత్వ పాఠశాలల్లో ముగ్గురు కుమార్తెలను చేర్పించింది. చదువు విలువ తెలియజేసింది. తల్లి కష్టాన్ని కుమార్తెలు గుర్తించారు. చదువులో రాణించారు. ఆర్థిక ఇబ్బందులు ఎదురైన వేళ పెద్దల అండదండలతో అవకాశాలను అందిపుచ్చుకున్నారు. ముగ్గురిలో ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికకాగా, మరొకరు పీహెచ్‌డీ చేస్తున్నారు. అమ్మనమ్మకాన్ని గెలిపించి అందరికీ ఆదర్శంగా నిలిచారు.

- తల్లినమ్మకాన్ని నిలబెట్టిన తనయలు
- సర్కారు కొలువుల సాధన



తల్లి బంగారమ్మతో కుమార్తెలు

ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈగా ఎంపికైన రేవతి

శృంగవరపుకోట: శృంగవరపుకోట పట్టణంలో శ్రీనివాసకాలనీలో నివసిస్తున్న మాచిట్టి బంగారమ్మకు ముగ్గురు ఆడపిల్లలు. సరస్వతి, రేవతి, పావని. వీరిని విడిచి తండ్రి వెళ్లిపోయాడు. బంగారమ్మే కంటికి రెప్పలా సాకింది. భవన నిర్మాణ పనులు చేస్తూ వచ్చిన కూలి డబ్బులతో చదువులు చెప్పించింది. ప్రభుత్వ పాఠశాలల్లో టెన్త్ వరకూ చదివిన 2వ కుమార్తె రేవతిని ఆర్థిక ఇబ్బందులతో ఒక దశలో చదువు మాన్పించాలనుకుంది. టెన్త్‌లో అత్యంత ప్రతిభ చూపిన రేవతికి స్థానిక పుణ్యగిరి విద్యాసంస్థల అధినేత ఎల్.సత్యనారాయణ తన కళాశాలలో ఉచితంగా ఇంటర్మీడియట్‌లో ప్రవేశం కల్పించారు. అత్యధిక మార్కులు సాధిస్తే భవిష్యత్‌లో కోరిన చదువుకు తనే ఖర్చు భరిస్తానంటూ భరోసా ఇచ్చారు. రేవతి ఇంటర్మీడియట్‌లో 984 మార్కులు సాధించింది. ఎంసెట్‌లో ర్యాంక్ సాధించి గాయత్రి ఇంజినీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్ పూర్తిచేసింది. 2019లో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం భర్తీచేసిన సచివాలయ ఉద్యోగాల్లో ధర్మవరం సచివాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా పోస్టు సాధించింది. అంతటితో వదిలేయకుండా ఏపీపీఎస్సీ పరీక్షలకు సాధన చేసింది. 2023 ఆగస్టులో పరీక్ష రాసింది. నవంబర్‌లో విడుదలైన ఫలితాల్లో విజయం సాధించింది. రేవతికి ప్రస్తుతం జోన్-1 పరిధిలో శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈగా నియమిస్తూ ప్రభుత్వం నుంచి మంగళవారం ఉత్తర్వులు అందాయి. ప్రస్తుతం రేవతి అక్క సరస్వతి ఏలూరులో సచివాలయ ఉద్యోగిగా పనిచేస్తుండగా, చెల్లెలు పావని పీహెచ్‌డీ చేస్తోంది. ముగ్గురు అమ్మాయిలు చదువులో రాణించడంతో తల్లి బంగారమ్మ సంతోషపడుతోంది. పిల్లలు సాధిస్తున్న విజయాలతో ఉబ్బితబ్బిబ్బవుతోంది.

లక్కీ గిఫ్ట్ స్కీమ్ విజేతలకు బహుమతులు



ప్రయాణికులకు బహుమతులు అందజేస్తున్న డిపో అసిస్టెంట్ మేనేజర్ ఆదినారాయణ

విజయనగరం అర్బన్: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణాన్ని ప్రోత్సహించడంతో భాగంగా నిర్వహించిన లక్కీ గిఫ్ట్ స్కీమ్ విజేతలకు కాంప్లెక్స్ ప్రాంగణంలో ఆర్టీసీ అధికారులు మంగళవారం అందజేశారు. విజయనగరం డిపో నుంచి సింహాచలం, ఆంధ్ర, చీపురుపల్లి-మెరకముడిదాం, విజయనగరం వయా జామి, ఎస్.కోట మార్గాల్లో జనవరి 16 నుంచి 30వ తేదీ వరకు అందించిన సర్వీసుల్లో ప్రయాణం చేసిన వారిని స్కీమ్‌కు అర్హులుగా తీసుకున్నారు. టికెట్స్ ఆధారంగా డ్రా తీసి గిఫ్ట్ స్కీమ్‌లో ఎంపికైన పలువురికి బహుమతులను డిపో అసిస్టెంట్ మేనేజర్ బి.ఆదినారాయణ అందజేశారు. కార్యక్రమంలో ఎస్టీఐ పి.రామారావు, స్టేషన్ మేనేజర్ పి.సత్యనారాయణ, రామరాజు, తదితరులు పాల్గొన్నారు.